ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

మంగళవారం 12 ఆగస్టు 2025



విజ్ఞాన మందిరంలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



జాతీయ పతాకంతో విద్యార్థుల ర్యాలీ, పాల్గొన్న కలెక్టర్

పంద్రాగస్టుకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటిపై ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని.. జాతీయ సమైక్యతను చాటాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. నరసరావు పేటలో సోమవారం హర్ ఘర్ తిరంగా అభియాన్ ర్యాలీని ఆయన ప్రారంభించి, పాల్గొన్నారు. ప్రతి పౌరుడిలో దేశభక్తిని పెంపొందించే లక్ష్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పల్నాడు రోడ్డులో ప్రారంభమైన భారీ ర్యాలీ పట్టణ ప్రధాన విధుల గుండా స్టేషన్‌రోడ్డులోని గాంధీ పార్కు వరకు సాగింది. భారీ జాతీయ జెండాను ర్యాలీలో ప్రదర్శించారు. ర్యాలీలో డీఆర్వో మురళీ, ఆర్డీవో మధులత, మునిసిపల్ కమిషనర్ జస్వంత్, తహసీల్దార్ వేణు, వివిధ కళాశాలల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలి

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని.. గణితంలో ప్రాథమిక భావనలు నేర్పించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని జాషువా సమావేశ మందిరంలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మానవ వనరుల అభివృద్ధిపై జిల్లాస్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. సిలబస్ పూర్తి చేయాలనే తొందరలో విద్యార్థులకు ప్రాథమిక అంశాలు నేర్పించడంలో నిర్లక్ష్యం వహించరాదని ఉపాధ్యా యులను కోరారు. నాణ్యమైన, విలువలతో కూడిన విద్య నేర్పిస్తూ.. సోషల్ మీడియా ప్రభావం విద్యార్థుల మీద పడకుండా చూడాలన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులను రేపటి మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు సలహాలను ఉపాధ్యాయులు, ఎంఈవోలు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యుల నుంచి కలెక్టర్ స్వీకరించారు. జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఈవో ఎల్.చంద్రకళ, డీఎంహెచ్‌వో రవి, ఉప విద్యాశాఖాధికారులు సుభాని, ఏసుబాబు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ఈ-క్రాప్ తిప్పలు తప్పేనా!

సాగు మొదలుకుని దిగుబడులను మద్దతు ధరకు అమ్ముకునే ప్రతి అంకంలోనూ 'ఈ-పంట నమోదు' కీలకం. పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీ ధరకు ఎరువులు అన్నింటికీ అదే ప్రామాణికం. సాగు విస్తీర్ణానికి, ఈ-పంట నమోదుకు పొంతన లేకుండా మమ అనిపించే తంతు గత ప్రభుత్వంలో నడిచింది. అన్నదాతలకు నేరుగా కొర్రీలు వేయకుండా ఈ-పంట సాకుతో వారిని అనేక పథకాల లబ్ధికి దూరం చేసిన ఘనత వైసీపీది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కూడా ఈ-క్రాప్ నమోదు అదే రీతిన సాగిందనేది తాజాగా మార్క్‌ఫెడ్ చేపట్టిన పొగాకు కొనుగోళ్ల అంశంలో బయటపడింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు ఈ-పంట నమోదు తాజాగా ఊపందు కుంది. సాగు వివరాలు పక్కాగా నమోదు చేయడానికి ప్రభుత్వం మార్గ దర్శకాలు జారీ చేసింది. సిబ్బంది అలసత్వం వీడి.. క్షేత్ర స్థాయిలో పర్యటించి పక్కాగా ఆన్‌లైన్ చేస్తేనే రైతాంగానికి ఈ క్రాప్ తిప్పలు తప్పే అవకాశం ఉంది.

- ఖరీఫ్ సీజన్‌కు మొదలైన ఈ-పంట నమోదు
- ఖాళీ భూముల వివరాలూ యాప్‌లో నిక్షిప్తం
- పొగాకు కొనుగోళ్లలో బయటపడిన 'రబీ' తప్పులు
- క్షేత్రస్థాయి నమోదులో సిబ్బంది అలసత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో ఈ క్రాప్ ప్రారంభమైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఈ పంటలో నమోదు చేయాలంటే పైరు వేసి కనీసం నెలయినా దాటి ఉంటేనే ఇమేజ్ పక్కాగా రావడానికి అవకాశం ఉందని సిబ్బంది చెబుతున్నారు. రైతులు తమ పైరు వివరాలు నమోదు చేసుకోవడానికి శ్రద్ధ చూపాలని వ్యవసాయ శాఖ కోరుతోంది. నమోదు ప్రక్రియ సెప్టెంబరు 15 వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత గ్రామసభలు, ఫిర్యాదుల స్వీకరణ, తుది జాబితా ప్రచురణతో ఖరీఫ్ సీజన్ (మిగతా 6వ పేజీలో)



వేటపాలెంలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్రమణ్యేశ్వరరావు (పాత చిత్రం)

అంతా డొల్లతనమే

పెసర సాగు చేస్తే మినుము, కంది సాగు చేస్తే శనగ ఇలాంటి అస్తవ్యస్త నమోదులు కోకొల్లలుగా రబీ సీజన్ మద్దతు ధర విక్రయాల్లో వెలుగు చూశాయి. క్షేత్రస్థాయిలో పర్యటించకుండా అరకొర సమాచారంపై ఆధారపడి వివరాలు నమోదు చేయడం వల్లే ఈ పంట నమోదులో అనేక అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కేవలం రైతు చెప్పిందే ప్రామాణికంగా అప్‌లోడ్ చేస్తున్నారే తప్పితే ఫీల్డ్ విజిట్‌కు తిలోదకాలిచ్చి మమ అనిపిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఉన్న సిబ్బందితో ప్రతి ఎకరం ఫీల్డ్ విజిట్ చేసి వివరాలు నమోదు చేయాలంటే సాధ్యపడదని, పైగా అన్నదాతలూ అందుబాటులో ఉండడం లేదనేది సిబ్బంది వాదనగా ఉంది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధం

- పెద్దల అలవాట్లను పిల్లల ద్వారా మార్చే ప్రయత్నం
- నేడు విజ్ఞాన మందిరంలో వర్కు షాప్
- హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జూనియర్ రెడ్‌క్రాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ యుద్ధాన్ని ప్రకటించింది. ఇందుకోసం ఒక వినూత్నమైన ప్రాజెక్టుని చేపట్టింది. తల్లిదండ్రుల అలవాట్లలో వారి పిల్లలతో మార్పు తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకోసం ఏపీ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్(ఏపీసీఏసీ), అమరావతి ప్లాస్టిక్ ఫ్రీ సిటీ క్యాంపెయిన్‌లకు సంబంధించి మంగళవారం వర్కుషాపు నిర్వహించబోతోంది. నగరంలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ వర్కుషాపులో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. ఏపీసీఏసీ అనేది ముఖ్యంగా ఉన్నత విద్యా సంస్థలలో పర్యావరణ స్పృహ, కార్యాచరణని ప్రోత్సహించడంపై దృష్టి సారించిన రాష్ట్ర స్థాయి చొరవ. ఇది వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ఐదు అంశాల వ్యూహాన్ని కలిగి ఉంటుంది. వీటిలో ఇంధన సామర్థ్యం, పునరుత్పాదక ఇంధన విస్తరణ, అడవుల పెంపకం, ప్రపంచ ఉత్తమ పద్ధతుల స్వీకారం, అవగాహన కార్యక్రమాలు ఇమిడి ఉన్నాయి. ఈ కార్యకలాపాలకు నాయకత్వం వహించడానికి విద్యార్థులను వాతావరణ మార్పు ఏజెంట్లుగా శిక్షణ ఇవ్వడం ప్రచార లక్ష్యంగా ఉంది. ఇప్పటికే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గత నెల మొదటి వారంలో కళాశాల విద్యా శాఖతో కలిసి ఒక సంయుక్త వర్కుషాప్‌ని విజయవాడలో నిర్వహించింది. కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో పర్యావరణ స్పృహ, కార్యచరణని ప్రేరేపించడం ఈ ప్రచారం లక్ష్యాలలో ఒకటిగా ఉంది. విద్యార్థులను యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లుగా నమోదు చేసుకొని క్లైమేట్ యాక్షన్ గ్రూపులను ఏర్పాటు చేస్తారు. ఈ క్యాంపెయిన్‌లో నీటి కాలూష్యం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లు, ఘన వ్యర్థాల తొలగింపు, చెట్ల పెంపకంపై దృష్టి పెడతారు. అలానే అమరావతి రాజధాని నగరం ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నగరంలో ప్రారంభం నుంచి ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా చేయాలని రెడ్‌క్రాస్ సంస్థ చొరవ తీసుకొనేందుకు ముందుకొచ్చింది. ఈ ప్రచార కార్యక్రమాన్ని కూడా గవర్నర్ నజీర్ ప్రారంభిస్తారు.

పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్ర గవర్నర్ ఎస్ఏ నజీర్ పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం పరిశీలించారు. వేదిక, సీటింగ్, పీఏ సిస్టం తనిఖీ ఏర్పాట్లపై అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో చర్చించి, సూచనలు అందించారు. జేసీ భార్గవ్ తేజ, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు ఇతర అధికారులున్నారు.

గుత్తికొండ బిలం రహదారికి గ్రీన్‌సిగ్నల్

- డీజీపీఎస్ సర్వే పూర్తి..
- ఎమ్మెల్యే యరపతినేని ప్రత్యేక చొరవ

పిడుగురాళ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో పర్యాటక కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందిన గుత్తికొండ బిలం ఆధునికీకరణకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ చూపారు. రహదారి నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గుత్తికొండ బిలం వరకు రహదారిని కొంతవరకు నిర్మించగా.. మరి కొంతభాగం అటవీశాఖ పరిధిలో ఉండడంతో.. అభ్యంతరం వ్యక్తమైంది. ఎమ్మెల్యే యరపతినేని అటవీశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. రహదారి నిర్మాణానికి అనుమతిని కోరారు. రహదారి నిర్మాణానికి అటవీశాఖ భూమి ఎంతైతే కోల్పోతుందో.. అంతే భూమిని రెవెన్యూ శాఖ ఇచ్చే ఒప్పందంతో అటవీశాఖ అధికారులు అనుమతించారు. రహదారి నిర్మాణానికి అటవీ శాఖ భూమి ఎంత కావాలో.. సోమవారం డీజీపీఎస్ సర్వే నిర్వహించారు. పంచాయతీరాజ్ డీఈ కోటేశ్వరరావు, ఏఈ శ్రీనివాసరెడ్డి, అటవీశాఖ బీట్ ఆఫీసర్ శ్యాం కుమార్, గుంటుపల్లి శ్రీనివాసరావు, పి.వెంకట్రావు, గూడూరి బ్రహ్మయ్య, వున్నం సురేష్ ఈ సర్వేను పర్యవేక్షించారు. కొద్ది రోజుల్లో మిగిలిన రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు పంచాయతీరాజ్ అధికారులు సిద్ధంగా ఉన్నారు.



బిలం దారిలో సర్వే చేస్తున్న అధికారులు



ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

'అన్నదాత సుఖీభవ' విజయోత్సవం

- 100 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ
- ట్రాక్టర్ నడిపి ఉత్సాహ పరిచిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

6



8

ర్యాగింగ్ వద్దు

- నేటి నుంచి...యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్
- వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు
- వైద్య కళాశాలలకు ప్రభుత్వ ఆదేశాలు జారీ

రజిని బీజేపీలోకి వెళ్దామనుకుంది..!

6

- స్టోన్‌క్రషర్ వివాదంలో ఎంపీ లావుకు రాయబారం
- ప్రశ్నించిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తోంది
- మాజీ మంత్రిపై సొంత పార్టీ నేతల తిరుగుబాటు



పిచ్చిచెట్ల మధ్య పిడుగురాళ్లలోని టిడ్కో గృహాలు

ఐదేళ్లయినా.. ఎక్కడి వక్కడే.!

- టిడ్కో గృహ ప్రవేశాలెప్పుడో?
- లబ్ధిదారుల ఎదురుచూపులు
- అద్దె భారంతో మధ్యతరగతి కుటుంబాలు

పిడుగురాళ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహ ప్రవేశం లబ్ధిదారులకు ప్రహసనంలా మారింది. ఇళ్ల నిర్మాణాలు పూర్తికాక.. రుణ వాయిదాలు చెల్లించ లేక నానా అవస్థలు పడుతున్నారు. సొంతింటి కల.. ఒక పీడ కలలా మారకుండా ఉండాలంటే.. కూటమి ప్రభుత్వం ఈ గృహ నిర్మాణాలపై ఒక నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నాలుగు వేల గృహాలు..

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు పురపాలక సంఘాలకు టిడ్కో గృహాలను కేటాయిం చారు. పిడుగురాళ్ల పురపాలక సంఘం పరిధిలోని కొండమోడు సీతారామపురం వద్ద 2017లో నాలుగు వేల టిడ్కో గృహాలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. ఓ సంస్థ నిర్మాణాలను చేపట్టింది. 2018 ఆఖరుకి 75 శాతం పనులు పూర్తికాగా 2019 ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే యరపతినేని పట్టణంలో పార్టీలకు అతీతంగా టిడ్కో గృహాలను కేటగిరీల వారీగా కేటాయించారు. 300గజాల పరిధిలో 2,016 మంది, 365 గజాల పరిధిలో 816 మందికి టిడ్కో గృహాల పనులు దాదాపు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగాయి. బ్యాంక్ రుణం కూడా గృహ నిర్మాణదారులకు మంజూరైంది. 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడ్కో గృహాల నిర్మాణాలను పక్కన పెట్టింది. లబ్ధిదారులకు మౌలిక వసతులను కల్పించకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించింది. నిర్మాణ పనులు చేపట్టిన సంస్థకు బిల్లులు జమలో జాప్యం చేయడంతో.. ఎక్కడి వక్కడే పనులు నిలిచిపోయా యి. సంబంధిత కాంట్రాక్టర్ కూడా వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఆరునెలల్లోనే సామగ్రిని తరలించుకు పోయారు.

తప్పని తిప్పలు..

వైసీపీ ప్రభుత్వం హయాంలో టిడ్కో గృహాలను మహిళలు, పొదుపు సంఘ సభ్యుల పేరుతో కేటాయించారు. ప్రభుత్వం బలవంతంగా ఒక్కొక్కరికి రూ.రెండున్నర లక్షలకు పైగా రుణం మంజూరు చేయించింది. మహిళల ఖాతాల్లో రుణ నగదు పడిన వెంటనే బ్యాంకర్లు గృహ నిర్మాణాలకు జమ చేసుకున్నారు. మహిళల చేతికి నగదు అందకపోయినా ప్రతి నెలా వాయిదాలు మాత్రం చెల్లించాల్సి వస్తోంది. ఇతర నగదు ఖాతాల్లో వేసుకున్నా.. రుణ వాయిదా కింద జమ కావడంతో కొందరు మహిళలు తమ బ్యాంక్ ఖాతాలను రద్దు చేసుకున్నారు. గృహ ప్రవేశాలు పూర్తయ్యాకే బ్యాంక్ రుణ వాయిదాలు చెల్లించాల్సిన నిబంధన ఉన్నప్పటికీ.. రుణం ఇచ్చిన మరుసటి నెల నుంచే నెలకు రూ.మూడున్నర వేలకు పైగా బ్యాంక్ వాయిదాలు చెల్లిస్తున్నారు. గృహాలు పూర్తి చేయకుండా.. గృహప్రవేశాలు కాకుండా రుణం ఎలా చెల్లించాలంటూ కొందరు మహిళలు బ్యాంక్ అధికారులను నిలదీసినా ఫలితం లేదు. తమ చేతిలో ఏమీలేదని, అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో బ్యాంక్ ఉన్నతాధికారుల నిర్ణయాల మేరకే ఇదంతా జరిగిందని ప్రస్తుత బ్యాంక్ అధికారులు సమాధానం ఇస్తున్నారు. వాయిదాలు చెల్లించలేక టిడ్కో గృహాలు మా కొద్దు బాబో అంటూ గుట్టుగా మరొకరికి విక్రయించేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారు.

నిర్లక్ష్యం.. నిరుపయోగం

తాగునీటికి తప్పని ఇక్కట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మునిసిపాలిటీలోని వివిధ ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు అమృత్ పథకం కింద మార్కెట్ యార్డులో ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. దీని వినియోగం మాత్రం పురపాలకులు విస్మరించారు. కోటప్పకొండ రోడ్డు, వినుకొండ రోడ్డు పరిధిలో ఈ తాగు నీటి ట్యాంక్ ఉంది. ట్యాంకుకు నీటి సరఫరా కోసం మోటార్లు తదితర పనుల కోసం రూ.1.50 కోట్లు వెచ్చించారు. ట్యాంక్ లోపల కాంక్రీట్ వేసేందుకు మెరక కోసం నాణ్యమైన గ్రావెల్‌ను వినియోగించాల్సి ఉండగా.. భవన వ్యర్థాలను తరలించడం గమనార్హం. నీటి సరఫరా పైపులనూ నిరుపయోగంగా వదిలేశారు. కాగా నెల రోజుల్లో ట్యాంకును వినియోగంలోకి తీసుకువస్తామని డీఈ రఫీ తెలిపారు.



నరసరావుపేట మార్కెట్ యార్డులో నిర్మించిన తాగునీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్



మోటార్లు ఏర్పాటు చేసిన బూస్టర్ గది



నిరుపయోగంగా పైపులు

'ఈ-క్రాప్' తిప్పలు తప్పేనా..!

(5వ పేజీ తరువాయి)

ప్రక్రియ ముగియనుంది.

పొగాకు కొనుగోళ్లలో బయటపడిన ఈ-క్రాప్ తప్పిదాలు

మార్క్‌ఫెడ్ చేపట్టిన పొగాకు కొనుగోళ్ల ఈ-పంట నమోదు అవకతవకలు బయటపడ్డాయి. క్షేత్రస్థాయిలో పొగాకు సాగు వేల ఎకరాల్లో ఉండగా ఈ-క్రాప్ గణాంకాల్లో అది పాతికశాతం కూడా లేదు. పైగా అదే పొలంలో వేరే పంట సాగు చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేశారు. రబీలో ఈ-క్రాప్ నమోదు వ్యత్యాసాలు పొగాకు కొనుగోళ్లకు ప్రతిబంధకంగా మారాయి. వాటిని ఒక కొలిక్కి తేవడానికి రాష్ట్రస్థాయిలో కసరత్తు చేయాల్సి వచ్చింది. ఇదే కాకుండా మద్దతు ధరకు తమ ఉత్పత్తులు అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలు బాట పట్టిన రైతులు.. నిరాశతో వెనుదిరిగిన ఉదంతాలు కోకొల్లలు.

ఖాళీ భూములతో సహా..

గతంలో జరిగిన ఈ క్రాప్ నమోదులో సాగు చేయకుండా ఖాళీగా ఉన్న భూములకు చోటుండేది కాదు. కానీ, వాటి వివరాలు కూడా పక్కాగా ఆన్‌లైన్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కౌలుదారుల విషయంలోనూ.. కౌలుదారు కార్డు ఉంటే దాని ఆధారంగా ఈ క్రాప్ చేయాలని, ఒక వేళ అది లేకున్నా సాగుదారుడి కింద కౌలుదారు పేరే నమోదు చేయనుంది. ప్రతి ఎకరం ఫొటో తీసి వివరాలు పక్కాగా నమోదు చేయాల్సిందే. వైసీపీ ప్రభుత్వంలో యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం యాప్‌తో ఈ-పంట నమోదు చేశారు. దానిలో అనేక లొసుగులు ఉండడంతో డేటా కచ్చితత్వంలో లేకపోవడం వల్ల అన్నదాతలకు అన్యాయం జరిగేది. ఇప్పుడు దాని స్థానంలో ఎస్ఐసీ యాప్ ద్వారా ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను ఈ ప్రభుత్వం అమల్లోకి తెచ్చి.. దాని ద్వారా పంట వివరాలను నమోదు చేస్తోంది.

జర్నలిజం డిప్లమో పరీక్షలు ప్రారంభం



తనిఖీ చేస్తున్న సమన్వయకర్త ఆచార్య మన్నవ సుబ్బారావు

పెదకాకాని, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సీఆర్ మీడియా అకాడమీ-ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం వర్సిటీలోని డిప్లమో ఇన్ జర్నలిజం కోర్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయని పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు. ఈ నెల 14న పరీక్షలు ముగుస్తాయన్నారు. తొలి రోజు పది మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. చరిత్ర విభాగం పరీక్ష కేంద్రంలో జరుగుతున్న ఈ పరీక్షలను ఆయన తనిఖీ చేశారు.

49,176 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 51,722 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,176 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,724 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11000
334	9500	13400	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13200	334	9500	13200
273	----	----	నెంబరు. 5	10000	13300
341	10000	14200	273	----	----
4884	----	----	341	11000	14600
సూపర్ 10	----	----	4884	10000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14200	తేజ	10000	14000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12500
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10200	12800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	5000	7000

రజిని బీజేపీలోకి వెళ్దామనుకుంది..!

- స్టోన్ క్రషర్ వివాదంలో ఎంపీ లావుకు రాయబారం
- ప్రశ్నించిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తోంది
- మాజీ మంత్రిపై సొంత పార్టీ నేతల తిరుగుబాటు

చిలకలూరిపేట, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట వైసీపీలో ముసలం పుట్టింది. పార్టీలో అన్నీ తానై వ్యవహరిస్తున్న మాజీ మంత్రి రజినీపై తిరుగుబాటు మొదలైంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ బొల్లెద్దు చిన్న (గడ్డం చిన్న), పోతవరం గ్రామ సర్పంచ్ షేక్ అబ్దుల్ బాషాను రెండు రోజుల క్రితం వైసీపీ నుంచి సెస్పెండ్ చేశారు. వారిద్దరూ వైసీపీలోని మరికొందరు నాయకులను కలుపుకుని సోమవారం మీడియా సమావేశం నిర్వహించి, రజినీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

బొల్లెద్దు చిన్న మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రజిని గుంటూరు వెళ్లి.. తిరిగి చిలకలూరిపేటకు పార్టీ ఇన్‌చార్జిగా వచ్చి పార్టీ నాయకులను పట్టించుకోవడం మానివేసిందన్నారు. ప్రధానంగా దళిత, ఇతర సామాజిక వర్గాలకు చెందిన నాయకులను దూరం పెట్టేశారని మండిపడ్డారు. వైసీపీ ఓటమి తర్వాత బండి సంజయ్, నాగబాబును.. మరి కొంతమంది నాయకులను కలిసి పార్టీ మారేందుకు ఆమె ప్రయత్నించారని ఆరోపించారు. పార్టీలో ప్రశ్నించే వారిని పార్టీ నాయకులకు తెలియకుండా సస్పెండ్ చేస్తున్నామని ప్రకటిస్తున్నారని అన్నారు. ఇటువంటి బెదిరింపులకు భయపడమని చెప్పారు. నియోజక వర్గంలో జగనన్న కాలనీ, స్టోన్ కస్టర్లు, వెంచర్లతోపాటు ఇతర వ్యవస్థలకు చెందిన వారి దగ్గర ఆమె పీఏల చేత అక్రమ వసూళ్లు చేయించడమే కాకుండా పార్టీని నాశనం చేశారని దుయ్యబట్టారు. దళిత నాయకుడు వెంగళ రాయుడు మీద గంజాయి కేసు కూడా పెట్టించినట్టు విమర్శించారు. బోయపాలెంలోని క్రషర్ యాజమాన్యం వద్ద డబ్బులు తీసుకోలేదని బోయపాలెంలోని పార్వతీ అమ్మ వారి గుడి వద్ద ప్రమాణం చేస్తావా అని సవాల్ విసిరారు. ఈ అవినీతి వ్యవహా రాన్ని సెటిల్ చేయమని ఎంపీ కృష్ణదేవరాయల వద్దకు రాయబారం పంపించావా? లేదా అంటూ నిలదీశారు. జగనన్న కాలనీ విషయం లో పసుమర్రు రైతుల దగ్గర నుండి కోట్ల రూపాయలు దోచుకున్నా రని ఆరోపించారు. పీఏ శ్రీకాంత్ రెడ్డి కోసం ఒక సీఐ మీదే గొడవ పె ట్టుకున్న రజనీ.. తన కోసం పనిచేసిన కార్యకర్తల మీద కేసులు పెడు తుంటే ఏనాడైనా పలకరించారా అని నిలదీశారు. పార్టీ విషయాల గురించి వైవీ సుబ్బారెడ్డి, గౌతమ్‌రెడ్డికి వివరించామని, ఈ నెల 17న పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఉంటుందని తెలిపారు.

పోతవరం సర్పంచ్ అబ్దుల్ బాషా మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో తాను రూ.5 లక్షలు ఇచ్చానని, తిరిగి ఇవ్వమని అడిగితే ఇవ్వడం లేదని పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళితే.. ఆయన డబ్బులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఆ తరువాత రజిని తనకు ఫోన్ చేసి బెదిరించడమే కాకుండా అసహ్యంగా దూషించిందన్నారు. పోతవరం పంచాయతీని ఏకగ్రీవం చేస్తామని చెప్పి, మౌలాలి అనే వ్యక్తిని పోటీగా పెట్టారన్నారు. అప్పుడు రూ.6 లక్షల వరకు ఖర్చు పెట్టానని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని సీనియర్ నాయకులకు వివరించామని, దీంతో రజిని పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తమను సస్పెండ్ అయ్యేలా చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి బతికినంత కాలం ఆయన కోసమే పనిచేస్తామని, రజిని తమకు వద్దని బాషా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యడ్లపాడు వైసీపీ నాయకులు సాగర్, కనపర్రు సర్పంచ్ వెంకటేశ్వర్లు, పోతవరం ఉప సర్పంచ్ వెంకటస్వామి, నాదెండ్ల ఎంపీపీ భర్త రత్తయ్య, నూతక్కి నాగేశ్వరావు పాల్గొన్నారు.

4 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల



నాగార్జున సాగర్ జలాశయం నుంచి 4 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 65,800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో సోమవారం ప్రాజెక్ట్ అధికారులు సాగర్ ప్రాజెక్ట్ 4 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. నాగార్జున ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 589.30 అడుగులు ఉంది. ఇది 309.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5800 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,785 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, 4 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 32,108 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 75,879 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో వాటర్‌గా 65,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

'అన్నదాత సుఖీభవ' విజయోత్సవం

❖ 100 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ

❖ ట్రాక్టర్ నడిపి ఉత్సాహ పరిచిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ విజయోత్సవాలను మండలంలోని మురికిపూడిలో సోమవారం కోలాహలంగా సాగింది. 100 ట్రాక్టర్లతో రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. రైతులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు.. స్వయంగా ట్రాక్టర్ నడిపి వారిని ఉత్సాహపరిచారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ధాన్యాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ చంద్రబాబు పాలన రైతులకు స్వర్ణయుగమన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోళ్లు జరిపించిన చంద్రబాబు రైతులు నష్టపోకుండా అన్నిచర్యలు తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వం బకాయిపెట్టిన ధాన్యం కొనుగోళ్ల సొమ్ము రూ.1674 కోట్లను ముఖ్యమంత్రి అయిన వెంటనే రైతులకు చెల్లించారన్నారు. పొగాకు కొనుగోళ్లతో పాటు మామిడి, మిర్చి, కోకో, టమాటా ఉత్పత్తుల్ని ప్రభుత్వమే కొని రైతుల్ని ఆదుకుందన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలోని 21,614 మంది రైతులకు అన్నదాతా సుఖీభవ కింద రూ.15.13 కోట్లు అందించినట్లు తెలిపారు.

విధుల నుంచి హాస్టల్ వార్డెన్ తొలగింపు

వాచ్‌మెన్ కూడా.. జిల్లా కలెక్టర్ ఆదేశం



దీపిక, హాస్టల్ వార్డెన్

దాచేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహంలో ఇటీవల విద్యార్థులు హాస్టల్‌లో ఘర్షణ పడటం జరిగింది. దీనికి బాధ్యులుగా చేస్తూ హాస్టల్ వార్డెన్‌ను విధుల నుంచి తొలగించటంతో పాటు హాస్టల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న సంజేశ్వరరావును విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు తోటి విద్యార్థిపై తీవ్రంగా దాడి చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని తెలుసుకున్న గురజాల డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. విచారణలో ఒక విద్యార్థిని మరో ఐదుగురు విద్యార్థులు కలసి దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని బీసీ హాస్టల్‌లోని గదిలో ఉంచి తీవ్రంగా దాడి చేశారు. ఆ విద్యార్థికి కరెంటు షాక్ కూడా పెట్టి సెల్ ఫోన్‌లో చిత్రీకరిస్తూ చంపుతామంటూ బెదిరింపులకు కూడా పాల్పడ్డారు. ఈ విషయాన్ని డీఎస్పీ దర్యాప్తులో సమాచారాన్ని సేకరించి విద్యార్థిపై దాడిచేసిన తోటి విద్యార్థులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్‌పై విద్యార్థులను విడుదల చేశారు. జరిగిన విషయం అంతా జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. హాస్టల్‌లో విద్యార్థులు ఘర్షణ పడుతుంటే హాస్టల్ వార్డెన్‌గా ఉన్న దీపిక, వాచ్‌మెన్ సంజేశ్వరరావులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని గుర్తించారు. వారిని బాధ్యులను చేస్తూ వార్డెన్‌ను వసతి గృహ విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. వసతి గృహంలో పొరుగు సేవల సిబ్బంది ఐన వాచ్‌మెన్ సంజేశ్వరరావును విధుల నుంచి తొలగించారు. హాస్టల్‌లో ఘర్షణ పడిన విద్యార్థులను హాస్టల్ నుంచి తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నారాకోడూరు-తెనాలి-మంగళగిరి నాలుగు లైన్ల రహదారి సర్వే



సంగం జాగర్లమూడి బ్రిడ్జి వద్ద సాయిల్ టెస్ట్ కోసం డ్రిల్లింగ్ చేస్తున్న కార్మికుడు

తెనాలి అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నారాకోడూరు-తెనాలి-మంగళగిరి నాలుగు లైన్ల రహదారి సర్వే పనులు ఈ-అసోసియేట్స్ కన్సల్టెన్సీ చేపట్టింది. సంగం జాగర్లమూడి బ్రిడ్జి వద్ద సాయిల్ టెస్ట్ కోసం డ్రిల్లింగ్ చేస్తున్నారు. 40 కి.మీ మార్గంలో నాలుగు లైన్ల రహదారి నిర్మించేందుకు ఈ సంస్థకు డీపీఆర్ సిద్ధం చేసే పనిని అప్పగించారు. ఈ మార్గంలో ఎక్కడ బ్రిడ్జీల అవసరం, ఎంత ఫౌండేషన్‌లో రోడ్డు నిర్మాణం చేయాలి అనే తదితర అంశాలతో డిటైల్డ్ ప్రాజెక్ట రిపోర్టును ఫిబ్రవరిలోగా ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. ఈ రహదారి నిర్మాణానికి అయ్యే వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాయి. అంతా సవ్యంగా జరిగితే డీపీఆర్ వచ్చిన తరువాత నిధులు కేటాయించి టెండర్లు పిలుస్తారని, వచ్చే వేసవిలో రహదారి పనులు ప్రారంభం కావచ్చునని అంచనా వేస్తున్నారు.

ఎఫ్ఏ-1 పరీక్షలను తనిఖీ చేసిన ఆర్‌జేడీ

గుంటూరు (విద్య) ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన ఫార్మేటివ్ అసెస్మెంట్ 1(ఎఫ్ ఏ 1) పరీక్షల నిర్వహణను పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ లింగేశ్వర రెడ్డి పరిశీలించారు. గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని పలు పాఠశాలల్లో ఆయన తనిఖీ చేపట్టారు. తొలిసారిగా బుక్ లెట్ విధానంలో నిర్వహించిన పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. నగరంలోని కొత్తపేట జలగం రామారావు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ముందుగానే బుక్‌లెట్ విధానంలో జరిగే పరీక్షలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

డీ ఫార్మసీలో ప్రవేశానికి ఆహ్వానం

గుంటూరు (విద్య) ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డీ ఫార్మసీ కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జాస్తి ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం గుజ్జనగుళ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల(92471 20305, 98480 38769)లో సంప్రదించాలని తెలిపారు.

ఓబీసీల ఆరాధ్య నాయకుడు నరేంద్రమోదీ

❖ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : దళితుల ఆరాధ్య దైవం అంబేద్కర్ అయితే ఓబీసీల ఆరాధ్య నాయకుడు నరేంద్రమోదీ అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. సోమవారం నరసరావుపేటలో విలేకరులతో మాట్లాడారు. ఆనాడు తన సామాజిక వర్గ ప్రజల కోసం విప్లవాత్మక రాజ్యాంగ బద్ధ ప్రకరణలతో అట్టడుగు వర్గాలైన దళితుల గుండెల్లో ఆరాధ్య దైవంగా నిలిచిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఈనాటి దేశ ప్రధాని నరేంద్రమోదీ కూడా అంబేద్కర్ స్ఫూర్తితో తన ఓబీసీ వర్గాల ఐకాన్‌గా ఆరాధ్య నాయకుడుగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. దేశంలో విప్లవాత్మక మార్పుల దిశగా నరేంద్రమోదీ కేంద్ర ప్రభుత్వాన్ని అడుగులు వేయించబోతున్నారని అన్నారు. ఏ ప్రధాని చేయని సాహసాన్ని చేసి చూపేందుకు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. సంఘ పరివార్‌ను ముఖ్యంగా ఆర్ఎస్ఎస్‌ను ఒప్పించి, ఓబీసీలకు సామాజిక న్యాయం అందించేందుకు సిద్ధపడుతున్నారని అన్నారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, యువజన అధ్యక్షుడు సుతారం విశ్వేశ్వరరావు, గాలి సాంబశివరావు పాల్గొన్నారు.

కుడి కాలువలో యువకుడి గల్లంతు



యానాది శివ (ఫైల్‌ఫొటో)

మాచర్లటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుడి కాలువలో ఈతకు దిగి యువకుడు గల్లంతైన సంఘటన మండలంలోని తాళ్లపల్లి వద్ద చోటుచేసుకుంది. మాచర్ల పట్టణానికి చెందిన యానాల శివ (28) పట్టణంలో ఇంటర్నెట్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం నాగార్జున సాగర్ చూడడానికి వెళ్లి తిరిగి మాచర్ల పట్టణానికి పయనమయ్యాడు. మార్గ మధ్యంలోని తాళ్లపల్లి బ్రిడ్జి కుడికాలువలో ఈత కొట్టేందుకు దిగి నీటి ఉధృతికి గల్లంతయ్యాడు. స్థానికులు విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు శివ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పొన్నూరుటౌన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందిన సంఘటన పొన్నూరు పట్టణంలో సోమవారం వెలుగు చూసింది. రైల్వే పోలీసులు, స్థానిక పోలీసుల కథనం ప్రకారం నిడుబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో ప్రభుత్వాసుపత్రి వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందిన సంఘటనను స్థానికుల ద్వారా పోలీసులు తెలుసుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

పొన్నూరుటౌన్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని మునిపల్లెకు చెందిన బురదగుంట బిందు (28)కి వినోద్ కుమార్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. ఆదివారం వినోద్ కుమార్‌తో భార్య బిందుకు చిన్నపాటి వివాదం జరిగింది. సోమవారం వినోద్ కుమార్ బంధువుల ఇంటికి వెళ్లి ఇంటికి రాగా బిందు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వినోద్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ గండు కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బిందు మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

14న వాలీబాల్ జట్ల ఎంపిక

గుంటూరు (విద్య) ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 15 విభాగంలో బాల బాలికల వాలీబాల్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక, ఫెడరేషన్ కార్యదర్శి మల్లంపూడి రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న మధ్యాహ్నం ఒంటిగంటకు గుంటూరు నగరంలోని ప్రభుత్వ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో (పాత బస్టాండ్ సెంటర్) ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తదితర వివరాలతో ఎంపికలకు రావాలన్నారు. 2010 జనవరి 1 తర్వాత జన్మించిన బాల బాలికలు అర్హులన్నారు. 18న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి జట్ల ఎంపికకు పంపుతామని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

నులి పురుగుల మాత్రలు వాడాలి..

పెదకూరపాడు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఏడాది నుంచి 19 సంవత్సరాల వయసున్న ప్రతి ఒక్కరికి నులిపురుగుల మాత్రలను మిగించాలని 75 తాళ్ళూ రు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మౌనిక తెలిపారు. రెండేళ్ల వయసున్న వారికి సగం టాబ్లెట్, ఆ పైబడిన వారికి ఒక టాబ్లెట్ వేయాలని సూచించారు.



నారాయణపురం బీసీ హాస్టల్‌లో దాడికి గురైన ఇంటర్ విద్యార్థితో మాట్లాడుతున్న గురజాల ఆర్డీవో మురళి

ఆర్డీవో హాస్టల్ సందర్శన

దాచేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తోటి విద్యార్థిపై దాడి చేసిన సంఘటనపై బీసీ కళాశాల బాలుర వసతి గృహాన్ని గురజాల ఆర్డీవో మురళీ సోమవారం సందర్శించారు. నాలుగు రోజుల క్రితం నారాయణపురంలోని బాలుర వసతిగృహంలో ఓ విద్యార్థిపై ఐదుగురు విద్యార్థులు దాడి చేసి తీవ్రంగా కొట్టారు. ఈ సంఘటనపై క్షేత్రస్థాయిలో విచారించేందుకు ఆర్డీవో మురళి బాధిత విద్యార్థితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. దాచేపల్లి డీటీ బ్రహ్మయ్య, వీఆర్వో యలమంద తదితరులు ఉన్నారు.

సంక్షిప్తం...

● దాచేపల్లి: నాయకురాలు నాగమ్మ ఆలయంలో మండప నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. దాచేపల్లి గ్రామానికి చెందిన భవానీ ఐరన్ స్టోర్ యజమానులు చిట్టిప్రోలు సూర్యం సోదరుల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, షరీఫ్, సర్పంచ్ జంగా సురేష్, తోట వెంకటేశ్వర్లు, జంగా సైదులు, రుద్రాల అచ్చారావు, నర్రా పుల్లయ్య, సాంబయ్య, కొండలు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల: అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా మంగళవారం నిర్వహించనున్న రైతు రథం ర్యాలీని వాయిదా వేస్తున్నట్లు పార్టీ నాయకులు పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ర్యాలీని వాయిదా వేస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు.

● పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలోని మహావీర్‌నగర్‌కు చెందిన వెచ్చా ఆంజనేయులు గృహంలో చోరీ జరిగింది. అంజనేయులు కథనం మేరకు.. ఈ నెల 7వ తేదీన హైదరాబాద్ వెళ్లి సోమవారం ఉదయం ఇంటికి రాగా తాళం పగులగొట్టి వుండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. బీరువాలో వున్న చెవి కమ్మలు, దిద్దులు, మరికొన్ని బంగారపు వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మోహన్ కేసు నమోదు చేశారు.

● సత్తెనపల్లి: సీపీఐ పట్టణ కార్యదర్శిగా వల్లెం లక్ష్మీ చెన్న కేశవరావును సోమవారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చెన్నకేశవరావు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

● ఓట్లు దొంగిలించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్ పాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ ఆధారాలతో బయటపెడితే బీజేపీ తట్టుకోలేక పోతుందన్నారు. ఈడీ, సీబీఐ, ఐటీని బీజేపీ జేబు సంస్థగా మార్చుకుందన్నారు. ఎన్నికల కమిషన్ ద్వారా ఓటర్ల జాబితాను బయట పెట్టాలన్నారు.

● రాజుపాలెం: ప్రభుత్వ పాఠశాలలో అందించే పోషకాహారాన్ని నిర్లక్ష్యం చేయవద్దని పీహెచ్‌సీ వైద్యుడు రవితేజా నాయక్ కోరారు. మండలంలోని రాజుపాలెం కేజీబీవీలో రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం కింద బాలికలకు చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ సోమవారం ఆయన పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జీవన వరప్రసాదరావు, ఎస్‌ఓ జ్యోతిర్మయి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

● క్రోసూరు: క్రోసూరు ఎంఈవోగా జీ కృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరులోని ఎస్‌పీకేహెచ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఇక్కడ ఎంఈవోగా నియమితులయ్యారు.

● బెల్లంకొండ: మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్ల మృతి పార్టీకి తీరని లోటని గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వర్లు గృహానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, బద్దూరి వీరారెడ్డి, సుబ్బారెడ్డి, చావలి ఎరుకలయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● విజయపురిసౌత్: డౌన్ మార్కెట్‌కు చెందిన మత్స్యకారుడు దోనె ధనరాజు ఇటీవల అనుపు జలాశయంలో గల్లంతై మృతిచెందాడు. మత్స్యకారుల సంఘ అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు సోమవారం మృతుని భార్య రాజేశ్వరికి సంఘం తరుపున రూ.6వేల నగదును అందించారు. కార్యక్రమంలో భూలోక, అప్పారావు, సింహాద్రి, దేవుడు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: మండలంలోని తాళ్లపల్లిలో ఈనెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శ్రీకృష్ణ చైతన్య యాదవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ యరగొర్ల సాంబశివరావు సోమవారం తెలిపారు.



పిడుగురాళ్ల: ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది, మెప్మా సిబ్బంది



అచ్చంపేటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

పిడుగురాళ్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పిడుగురాళ్లలో అధికారులు, సిబ్బంది హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ, సచివాలయాల సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. జడ్‌పి హైస్కూల్ నుండి ప్రధాన రహదారిలో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవ, జాతీయ జెండా విశిష్టతను కమిషనర్ వివరించారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో సోమవారం హర్ ఘర్ తిరంగ ర్యాలీ జరిగింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ జరిపారు. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జండా కట్టాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో తహసీల్దార్ కే శ్రీనివాసరావు, ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పోలీసులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, గ్రామ సేవకుల డివిజన్ కార్యదర్శి కోట సుబ్బారావు, తిరువాయిపాటి ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలు నాటు పద్ధతితో వరిలో అధిక లాభాలు

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సాలునాటు పద్ధతి లేదా బెంగాల్ నాటు పద్ధతి ద్వారా వరి నాటుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాకానివారిపాలెంలో సాలునాటు పద్ధతి ద్వారా వరినాట్లు వేసిన విధానాన్ని ఆయన సందర్శించి విలేకరులతో మాట్లాడారు. వరిలో ప్రకృతి వ్యవసాయం చేసేవారికి ఈ పద్ధతి ఎంతో అనువైందన్నారు. ఈ పద్ధతిలో నాటుకయ్యే ఖర్చు తగ్గుతుందన్నారు. రైతులకు సందేహాలుంటే వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏవో పోట్ల నరసింహారావు, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్, పంగులూరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

ఆర్థికసాయం అభినందనీయం

పేద విద్యార్థి చదువుకు అధికారులు ఆర్థికసాయం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని వేపకంపల్లి గ్రామానికి చెందిన బద్రి సాంబశివరావు కుమార్తె సౌమ్యకు ఉన్నత చదువుల నిమిత్తం రూ.50 వేలను అధికారులు సమకూర్చి సోమవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. కార్యక్రమలో పంగులూరి అంజయ్య, పుల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, మునుగోటి సత్యం, బూసా రామాంజినేయులు, ఉన్నం లక్ష్మీనారాయణ, బొల్నేడి శ్రీనివాసరావు, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, తహసీల్దార్ వెంకేశ్వర్లునాయక్, ఏవో నరసింహారావు పాల్గొన్నారు.

ప్రతి రైతుతో ప్రకృతి వ్యవసాయం చేయించాలి

మాచవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోనే ప్రతి రైతుతో ప్రకృతి వ్యవసాయం చేయించాలని, దానిపట్ల అవగాహన కలిగేలా వివరించాలని ఏవో రామమ్మ వీఏఏలను ఆదేశించారు. సోమవారం మండలంలోని కొత్త గణేషునిపాడు రైతు సేవా కేంద్రంలో పిడుగురాళ్ళ, మాచవరం, దాచేపల్లి మండలాల వీఏఏలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా సిబ్బంది ఎన్ఎస్‌పీ అప్పలరాజు, మాస్టర్ ట్రైనర్ బాజీబాబు, సుబ్బారెడ్డి, మోడల్ మేకర్ హసీనా, సునీల్, జ్యోతి, రమేష్, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

చిన్న తరహా నీటివనరుల గణనపై వీఆర్వోలకు అవగాహన

దుర్గి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ ఎస్‌వో మహ్మద్ అయూబ్ ఆధ్వర్యాన వీఆర్వోలకు చిన్న తరహా నీటి వనరుల గణనపై అవగాహన కల్పించారు. వీఆర్వోలు చేస్తున్న సర్వేను ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. సర్వే నిర్వహణలో తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో ఏఎస్‌వో ప్రభాకర్, ఆర్ఐ యోబు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్రావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, విద్యుత్ ఏఈ శ్రీశైలం, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆటో ఫైనాన్స్ అండ్ ఎంప్లాయిస్ ఫైనాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

కారంపూడి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆటో ఫైనాన్స్ అండ్ ఎంప్లాయిస్ ఫైనాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బొగ్గారపు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగిం ది. ప్రధాన కార్యదర్శిగా ముచ్చర్ల వెంకట రామకోటేశ్వరరావు, కోశాధికారి సన్నిధి వెంకట శ్రీనివాసరావు, ఉ పాధ్యక్షుడిగా గజితి అమరయ్య, జాయింట్ సెక్రటరీ గా సూరె కోటేశ్వరరావులు ఎన్నికయ్యారు. కార్యక్రమం లో కల్లు రమేష్, గుండా వెంకట ఉమామహేశ్వర, బొమ్మిన హనుమయ్య, అసోసియేషన్ నేతలు వీర్ల వరప్రసాదరావు, బండారు. వీరేశ్వరరావు, సూరె నాగరాజు, పిన్నెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

14న సాధారణ సర్వసభ్య సమావేశం

దుర్గి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యప్రసాద్ అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయండి

● పీఏసీఎస్ అధ్యక్షుడిగా రామారావు ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే ప్రవీణ్

అచ్చంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల అభివృద్ధికి కార్యవర్గం కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం వేల్పూరు పీఏసీఎస్ చైర్మన్‌గా జువ్వా రామారావు, డైరెక్టర్లుగా పాటిబండ్ల వెంకటేశ్వర్లు, కుంభా లక్ష్మణ్ ఎమ్మెల్యే ప్రవీణ్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. వేల్పూరులో జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో సీనియర్లను గౌరవిస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. అమరావతి, బెల్లంకొండ రోడ్డును త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్ నుంచి వేల్పూరు వరకు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహన భారీ రైతులు, అన్నదాత సుఖీభవ ర్యాలీ నిర్వహించారు. వేల్పూరులోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, పార్టీ నేతలు కంచేటి సాయిబాబు, నూర్జహాన్, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌కే జానీ, కొప్పురావూరి కోటేశ్వరరావు, నల్లమేకల వెంకటేశ్వర్లు, పాటిబండ్ల బాలయ్య, మద్దిరాల గంగాధర్, పొన్నెకంటి రవి, బాపిరెడ్డి, గంధం కోటేశ్వరరావు, నల్లపాటి చందు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రవీణ్ సమక్షంలో వేల్పూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా ప్రమాణం చేస్తున్న జువ్వా రామారావు

పాఠశాల గేటు ఏర్పాటుకు రూ.70 వేల విరాళం

రెంటచింతల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాల గ్రామం ఎస్సీ కాలనిలో వున్న మండల పరిషత్ పాఠశాలకు గేటు ఏర్పాటుచేసే నిమిత్తం బీజేపీ యువమోర్చా నేత ఇగుటూరి రాజశేఖరరెడ్డి రూ.70 విరాళం ఇచ్చినట్లు హెచ్ఎం శిరీష చెప్పారు.

● కొత్త విద్యాసంవత్సరం నుంచి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన చేసి యాప్‌లో నమోదు చేసే ప్రక్రియపై విద్యాశాఖాధికారులు పునరాలోచించాలని యూటీఎఫ్ రాష్ట్ర నేత డాక్టర్ చిన్నమ్మ కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం మంచిదే అయినా టీచర్లపై అదనపు భారం పడుతుందన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో, సిబ్బంది లేని ఉన్నత పాఠశాలల్లో నమోదు కష్టమవుతుందని చెప్పారు.

● అమరావతి: సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో రైతుల నుండి నాలుగు అర్జీలు దాఖలైనట్లు తహసీల్దార్ డానియేలు తెలిపారు. ఇవి డిజిటల్ సైన్‌కు సంబంధించినవి కాగా వాటిని వెంటనే పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపారు.

చర్లగుడిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా రామారావు

గురజాలటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లగుడిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా వీరేపల్లి రామారావు సోమవారం సొసైటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. వైస్ చైర్మన్‌గా సంగుల బుల్లబ్బాయి, కమిటీ సభ్యులుగా పాటిపల్లె లక్ష్మయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రామారావు మాట్లాడుతూ సొసైటీ చైర్మన్‌గా తనను ఎంపిక చేసిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు సబ్సిడీ ఎరువులు, వ్యవసాయ రుణాలు సకాలంలో అందేలా బాధ్యత తీసుకుంటానన్నారు. అనంతరం రామారావుకు టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, అడపా శ్రీనివాసరావు, నేలవల్లి బొల్లయ్య, నవులూరి శ్రీరామ్మూర్తి, శరమాల హనుమంతురావు, పలుచూరి నాగేశ్వరరావు, బిక్క పూర్ణ, వేముల రామకృష్ణ, కావూరి రక్షకుడు, మానుకొండ సైదయ్య, నారికళ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రామారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు



గ్రంథాలయ అధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

పాఠకులకు సౌకర్యాలు ఎలా ఉన్నాయి?

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం టీడీపీ నేతలతో కలసి సందర్శించారు. గ్రంథాలయంలో పాఠకులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. గ్రంథాలయానికి ఏఏ పుస్తకాలు వస్తున్నాయి?, పేపర్లు అన్ని వస్తున్నాయా? అని గ్రంథాలయ అధికారి వాణిని అడిగి ఆయన తెలుసుకున్నారు. గ్రంథాలయంలో మరమ్మతులు చేయించటంతో పాటు ఫర్నీచర్ ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పట్టణంలోని 10వ వార్డులో ఇటీవల మరణించిన వార్డు టీడీపీ అధ్యక్షుడు శిఖా ఏడుకొండలు తల్లి బంగారమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, మస్తాన్ వలి, అబ్దుల్లా, దరువూరి నాగేశ్వరరావు, నూర్ బాషా జానీ బాబు, మక్కపాటి రవిచంద్ర, పురుషోత్తం నాయక్, గౌస్, రాంబో బుడే, కార్తీక్ పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో శాంపిల్ మందుల అమ్మకాలు

● షాపుల వద్దే వైద్య సేవలు

పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు



గురజాలటౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణ, మండల పరిధిలోని మెడికల్ దుకాణాల్లో శాంపిల్ మందులు విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అలాగే మెడికల్ షాపుల వద్ద రోగులకు షాపుల యాజమాన్యం వైద్యం అందిస్తున్నారు. రోగికి టైఫాయిడ్, డెంగీ, మలేరియా వంటి ఏ రోగం వచ్చినా మెడికల్ షాపుల వద్దనే రక్త పరీక్షలు, సెలైన్ బాటిల్ పెట్టి వైద్యం అందిస్తున్నారు. సదరు అధికారులకు మామూళ్లు అందుతుండటంతోనే పర్యవేక్షణ కొరవడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భారీ వృక్షాల నరికివేత

మాచర్లటౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వృక్షాలను సంరక్షించాలని ప్రభుత్వం ప్రజల్లో చైతన్యం తెస్తుంటే కొందరు వ్యక్తులు తమకు అడ్డుగా ఉన్నాయంటూ వృక్షాలను నరికివేస్తున్నారు. పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో ఇష్టానుసారంగా వటవృక్షాలను నరికివేస్తున్నారు. జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించే గృహాలకు అడ్డుగా ఉన్న వృక్షాలు, క్వార్టర్స్ వద్ద ఉన్న చెట్లను నరికివేస్తున్నారు.

వర్షాలు కురవాలని కోరుతూ వరద పాశం

రెంటచింతల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం అన్నదాతలు వరదపాశం కార్యక్రమం నిర్వహించారు. పొంగళ్లు అమ్మవారికి నైవేధ్యంగా సమర్పించిన అనంతరం స్వామివారి చెంత నుంచి నదిలోకి మెట్ల మీద పాశం పోసుకుంటూ వర్షాలు కురవాలని ప్రార్థించారు. రైతు కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సో మవారం 41.43 టీఎంసీల నీటి ని ల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుం చి 67,390 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 16,600 పవర్ జనరేషన్ ద్వారాను, రెండు గేట్ల ద్వారా 27,866, లీకుల ద్వారా 400, మొత్తం 44,866 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

వర్షంతో రైతులకు ఊరట

● పొంగిన వాగులు
● రాకపోకలకు అంతరాయం

పిడుగురాళ్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో కొంతమేర ఊరట లభించింది. గత కొద్దిరోజులుగా వేసవికాలాన్ని తలపించేలా ఎండ తీవ్రతకు గత రాత్రి, సోమవారం కురిసిన వర్షాలకు ప్రజలకు ఉపశమనం లభించింది. ఇప్పటికే సాగులో వున్న పత్తి పంటకు, వరి పంటకు ఈ వర్షం కాసుల వర్షంగా చెప్పవచ్చు. వర్షం ధాటికి జూలకల్లు, పందిటివారిపాలెం, గుత్తికొండ సమీపాలలో వున్న చప్టాలపై వర్షపునీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నీటి ప్రవాహం మధ్యలో ఆగిన ఆర్టీసీ బస్సు

గుంటూరు-మాచర్ల రహదారిపై అనుపాలెం వద్ద ఉన్న రోడ్ లెవల్ చప్టాపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నాలుగు గంటలుగా అ మార్గంలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సత్తనపల్లి నుంచి నరసరావుపేట మీదుగా మాచర్ల పిడుగురాళ్లకు వాహనాలను మళ్లించారు. అనుపాలెం చప్టా వద్ద రాజుపాలెం పోలీసులు వాహనాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా నడిపించారు. 9 గంటల సమయంలో గుంటూరు నుండి మియాపూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు నీటి ప్రవాహంలో వస్తుండగా మధ్యలో ఆగిపోవడంతో బస్సులో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. వర్షపు నీరు తగలడంతో బస్సులో నుండి పొగలు వచ్చాయి. స్టార్ట్ కాకపోవటంతో పాటు బస్సులో లైటింగ్ కూడా నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. రహదారిపై ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

పట్టణంలో జోరు వాన

సత్తెనపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో అల్లాడిన జనం వర్షంతో ఉపశమనం పొందారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ సాగుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు. వర్షంతో తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.



పిడుగురాళ్ల: నీటి ప్రవాహంలో ఆగిన హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్



రాజుపాలెం: గుంటూరు- మాచర్ల రహదారిపై అనుపాలెం లో-లెవల్ చప్టా వద్ద పొంగిపొర్లుతున్న వాగు

భారీ వర్షం.. పొంగిపొర్లుతున్న వాగులు

రాజుపాలెం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి పొర్లుతున్నాయి. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి గుంటూరు-మాచర్ల రహదారిపై అనుపాలెం గ్రామ సమీపంలో ఉన్న లో-లెవల్ చప్టాపై నీరు ఉధృతంగా ప్రవహించటంతో రాకపోకలు రెండు గంటల పాటు నిలిచిపోయాయి. రెడ్డిగూడెం గ్రామ సమీపంలో ఉన్న లో-లెవల్ బ్రిడ్జిపై నుండి నీరు ప్రవహించటంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో సోమవారం సాయంత్రం భారీ వర్షం పడటంతో బెల్లంకొండ మెయిన్ రోడ్డు అంతా వర్షపు నీటితో నిండిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బెల్లంకొండ జడ్పీ పాఠశాల ఆవరణ, తహసీల్దార్ కార్యాలయ ఆవరణ వర్షపు నీటితో నిండి పోయింది. ఎస్సీ కాలనీలోకి వర్షపునీరు చేరింది. మున్నెసుల్తాన్‌పాలెం చప్టాపై నీరు పొర్లి రాకపోకలకు అంతరాయం కలిగింది.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

క్రోసూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరులో సోమవారం ఐసీడీఎస్ అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నదని తెలుసుకొని ఐసీడీఎస్ సూపర్ వైజర్, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. గ్రామ పెద్దలను, తల్లిదండ్రులను సమావేశపరచి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామ పెద్దలతోను, ఇరువైపుల బంధువులతోను చర్చలు జరిపి బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవి కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, పీఎస్, అంగన్‌వాడీ టీచర్లు, చైల్డ్ ప్రొటక్షన్ కమిటీ సభ్యులు, గుడ్ షఫర్డ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్తి పంపకాలపై ఒత్తిడి.. వ్యక్తి అదృశ్యం



వీరాంజనేయులు

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పంపకాల పై కుటుంబసభ్యులు ఒత్తిడి చేయటంతో వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని ధూళ్ళిపాళ్ళలో జరిగింది. రూరల్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పచ్చ వీరాంజనేయులకు (54), కుటుంబసభ్యులకు ఈనెల 1వ తేదీన ఆస్తి పంపకాల విషయంలో ఒత్తిడి జరిగింది. ఆస్తి పంచాల్సిందేనంటూ కుటుంబసభ్యులు, బంధువులు ఒత్తిడి తేవటంతో మనస్తాపానికి గురైన ఆయన అదేరోజు ఇంటినుంచి బయటకు వెళ్ళాడు. రెండుమూడు రోజులైనా తిరిగి రాకపోవటంతో సోమవారం వీరాంజనేయులుకు వదిన వరుస అయ్యే రమాదేవి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 08641-232033, 9440796231 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని రూరల్ పోలీసులు కోరారు.



అమర వీరుల స్థూపాలకు రంగులు వేస్తున్న కార్మికులు



గాంధీజీ ప్రసంగించిన కూడలి గాంధీచౌక్

నేడు అమరవీరుల సంస్మరణ

నాటి స్వాతంత్ర్య ఉద్యమంలో తెనాలి ప్రముఖ పాత్ర వహించింది. నాటి అడుగు జాడలు నేటికీ స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటుతున్నాయి. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో ఏడుగురు తెనాలి పౌరులు ప్రాణత్యాగం చేశారు. బ్రిటీష్ కాల్పుల్లో మరణించిన మాజేటి సుబ్బారావు, శిరిగిరి లింగం, భాస్కరుని లక్ష్మీనారాయణ, తమ్మినేని సుబ్బారెడ్డి, గాలి రామకోటయ్య, ప్రయాగ రాఘవయ్య, జాస్తి అప్పయ్య స్మారక స్థూపాలను రణరంగ చౌక్‌లో ఏర్పాటు చేసి ప్రతిఏటా ఆగస్టు 12న అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. నేటి కార్యక్రమాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

- క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రాణాలర్పించిన ఏడుగురు
- స్వాతంత్ర్య ఉద్యమంలో తెనాలి అడుగు జాడలు

తెనాలి అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ స్వాతంత్ర్య పోరాటంలో మూడు మార్లు తెనాలి వచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమంలో ఏడుగురు ప్రాణాలు అర్పించారు. పలు రహదారులు, పార్కులకు జాతి నేతల పేర్లు ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తుంటాయి. నాజరుపేటలో 1921లో ఏర్పాటు చేసిన తిలక్ జాతీయ విద్యాలయంలో గాంధీ పిలుపు మేరకు ఆంగ్ల భాషను త్యజించి హిందీ భాషను జాతీయ భాషగా గుర్తించి ప్రచారం చేసే కార్యక్రమం చేపట్టారు. ఆయన పిలుపునిచ్చిన హిందీ ఉద్యమాన్ని ప్రచారం చేస్తున్న మహాత్ముడు తొలిసారిగా ఇక్కడకు వచ్చారు. జాతీయ జెండాను కూడా ఆవిష్కరించారు. ఆ జెండా ఎగురవేసిన ఓ టేకు స్థంభం ఈ మధ్య వరకు గుర్తుగా నిలబడి ఉంది. స్వాతంత్ర్య ఉద్యమం కోసం వచ్చే వారు ఇక్కడ సమావేశమై పోరాట ప్రణాళికలు రూపొందించుకునేవారు. ఆ ప్రాంగణం గాంధీ శిబిరంగా పిలుచుకునేవారు. 1930లో శిబిరాన్ని పోలీసులు నేలమట్టం చేశారు. 1938లో హిందీ ప్రేమీ మండలి నిర్మించి ఇప్పటి వరకు హిందీ ప్రచారం చేస్తూ ఉన్నారు.స్వరాజ్య నిధికి ఆయన జోలి పట్టడంతో రూ.2312 విరాళాలు వచ్చాయి.

నాటి మున్సిపల్ చైర్మన్ త్రిపురనేని రామస్వామి చౌదరి ఆధ్వర్యంలో మహాత్మునికి పౌర సన్మానం చేశారు. 1933 డిసెంబరులో మరోమారు గాంధీజీ తెనాలి వచ్చారు. రైల్వే స్టేషన్ పడమర వైపు చెంచుపేటలో ప్రసంగించి కొల్లా తయారమ్మ పాఠశాలను ప్రారంభించారు. అక్కడ ఇప్పుడు శబరి వృద్ధాశ్రమం నడుస్తోంది. కోదండ రామాలయంలో దళితులకు ప్రవేశం కల్పించారు. ఐతానగర్‌లోని ఆలపాటి బాపయ్య గృహంలో బస చేసిన ఆయనకు స్వరాజ్యనిధికి విరాళాలు అందించారు. 1946 జనవరిలో దక్షిణ భారత హిందీ మహాసభలకు మద్రాసు వెళుతూ తెనాలిలో ప్లాట్‌ఫారంపై స్నానం చేశారని చెబుతారు. వేలాది మంది ప్రజలు ఆయనను చూసేందుకు స్టేషన్‌కు చేరుకోగా సోమవారం మౌనవ్రతం కావడంతో అందరికి అభివాదం చేసి మద్రాసు వెళ్లిపోయారు. పట్టణంలోని ఒక పార్కుకు గాంధీ ఇర్విన్ ఒడంబడిక గుర్తుగా ఆ పేరు పెట్టారు. కవెవరంలో బాంబు పేలుడు సంఘటన బ్రిటీష్ ప్రధానమంత్రి వరకు వెళ్లి తెనాలి ఎక్కడా అని ఆరా తీయడం విశేషం.

పట్టణంలోని రహదారులకు టంగుటూరి ప్రకాశం, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వీవీ గిరి, సరోజిని నాయుడు, కృష్ణారావు వంటి జాతినేతల పేర్లతో పిలుస్తూ స్వరాజ్య స్ఫూర్తిని చాటుతున్నారు. తెనాలి పట్టణంలో గాంధీచౌక్ అంటే తెలియనివారు ఉండరు. స్వాతంత్ర్య ఉద్యమంలో నాలుగు రోడ్ల కూడలి అయిన ఇక్కడ ప్రజలను ఉద్దేశించి గాంధీ ప్రసంగించడంతో ఆ కూడలికి ఈ పేరు వచ్చింది. కూడలిలో నలుగురు జాతి నేతల విగ్రహాలు ఏర్పాటు చేశారు.



నాజరుపేట హిందీ ప్రేమీ మండలి ప్రాంగణం

మన మిత్రలో మరిన్ని సేవలు

15 నుంచి ఏడు వందల సేవలు అందుబాటులోకి



ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా వాటిని ఇంటి నుంచే పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకు వచ్చింది. మన మిత్ర పేరిట అమలవుతున్న కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా సేవలు పొందేందుకు, ఫిర్యాదులు చేసేందుకు సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

సత్తెనపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందిస్తున్న ప్రభుత్వం వాటిని ఏడు వందలకు పెంచాలని నిర్ణయించింది. ఈ నెల 15వ తేదీ నుంచి మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ సేవలను అందించేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జనవరిలో 26 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 121 సేవలతో మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభం కాగా సేవలను క్రమంగా పెంచారు. ప్రస్తుతం ఐదు వందలు సేవల వరకు అందుతున్నా యి. వీటిని 15వ తేదీ నుంచి ఏడు వందల వరకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాలనలో టెక్నాలజీ వినియోగానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో పౌర సేవలు సెల్ ఫోన్ ద్వారా అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇందులో విద్యార్థులకు పరీక్షలకు హాల్ టిక్కెట్లు, రేషన్ కార్డుల సేవలు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్టేటస్‌లు తెలుసుకొనే వెసులు బాటు కల్పించారు. తెలుగు, ఆంగ్ల బాషల్లో సేవలు అందుబాటులో ఉన్నాయి. పౌరులు ఒక క్లిక్‌తో లైసెన్స్‌లు, పన్నులు, బిల్లులు చెల్లించవచ్చు. ఆలయాల దర్శనాల బుకింగ్, పరీక్షా ఫలితాలు ఇంటి వద్ద నుంచే తెలుసుకొనే అవకాశం కల్పించారు. అన్ని శాఖల డేటాను ఆర్‌టీజీఎస్‌తో ప్రభుత్వం అనుసంధానం చేసింది. ప్రతి ఒక్కరి వ్యక్తి గత సమాచారం ప్రభుత్వం వద్ద ఉంది. దీనిని శాఖల వారీగా మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌కు అనుసంధానం చేశారు. క్యూఆర్ కోడ్‌తో ధ్రువ పత్రాలు, ఇతర పౌర సేవలు పొంద వచ్చు. భవిష్యత్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయటంతో నకిలీ, అసలు గుర్తించే సౌలభ్యం అందుబాటులోకి రానుంది.

ప్రభుత్వ వాట్సాప్ నెంబరు 9552300009ను మన మిత్ర పేరిట మీ ఫోన్‌లో నమోదు చేసుకోవాలి. ఆ నెంబరుకు హాయ్ అని సందేశం పంపాలి. వెంటనే ఏపీ ప్రభుత్వ లోగోతో ఒక సందేశం వస్తుంది. తద్వారా మీకు కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవాలి. వెంటనే వాట్సాప్‌లో ఏఐ ఆధారిత చాట్ బాక్సులో లభ్యమయ్యే అన్ని ప్రభుత్వ సేవల జాబితా కన్పిస్తుంది. ఇందులో మీకు కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవచ్చు. వాయిస్ కమాండ్ కూడా ఉపయోగించు కోవచ్చు. మీరు కోరుకున్న సేవకు సంబంధించి చాట్ బాక్స్ మరికొన్ని అదనపు వివరాలు అడగ వచ్చు. ఆధార్ నెంబరు, మొబైల్ నెంబరు లాంటివి మీరు ఇచ్చిన వివరాలను తనిఖీ చేసి తరువాత అందులో సిస్టమ్ మీకు రియల్ టైమ్ అప్‌డేట్ ద్వారా కన్ఫర్మేషన్ సందేశం పంపుతుంది. చెల్లింపులు కోసం భద్రతతో కూడిన ఒక పేమెంట్ లింకును కూడా పంపుతుంది. మీరు జరిపిన లావాదేవీలకు సంబంధించి డిజిటల్ కాపీ లేదా రసీదును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. చాట్ బాక్సులో ధ్రువీకరణ పత్రాలు, రసీదులు లేదా ఎకనాలెజ్‌మెంట్ రూపొందించి మీకు అందిస్తుంది.

రేపల్లె - మార్కాపురం - తెనాలి రైలు పాక్షిక పునరుద్ధరణ

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల - తెనాలి - చుండూరు మధ్యన ప్రీఎన్ఐ, ఎన్ఐ, పోస్టు ఎన్ఐ పనుల కారణంగా రద్దు చేసిన రేపల్లె - మార్కాపురం - తెనాలి ప్యాసింజర్ రైళ్లను రైల్వే శాఖ ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు పాక్షికంగా పునరుద్ధరించింది. 67238 రేపల్లె - మార్కాపురం రోడ్డు ప్యాసింజర్ రేపల్లె - గుంటూరు మధ్యన రద్దు చేసి.. గుంటూరు - మార్కాపురం రోడ్డు మధ్యన సర్వీసుని పునరుద్ధరించారు. 67239 మార్కాపురం - తెనాలి ప్యాసిజంర్‌ని గుంటూరు వరకే నడిపి గుంటూరు - తెనాలి మధ్యన రద్దు చేశారు. 67248 గుంటూరు - విజయవాడ ప్యాసింజర్‌ని 120 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు విజయనగరం వరకే ప్రయాణిస్తుంది. 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరుకు వస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.



ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న సీఆర్డీఏ కార్యాలయం

తుది దశకు సీఆర్డీఏ కార్యాలయ నిర్మాణం

పరిశీలించిన మంత్రి నారాయణ

తుళ్లూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాయపూడిలో తుది మెరుగులు దిద్దుకుంటున్న సీఆర్డీఏ కార్యాలయాన్ని మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు. ఆధునిక హంగులతో 2,42,481 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ 7 అంతస్తుల భవన నిర్మాణం దాదాపుగా పూ ర్తి అయ్యింది. ప్రతి అంతస్తులో అధికారుల కేబిన్‌లు, ఉద్యోగుల వర్క్ స్టేషన్లు మంత్రి పరిశీలించారు. సీఆర్డీఏ, ఏడీసీతో పాటు మున్సిపల్ శాఖకు చెందిన పలు విభాగాలను ప్రభుత్వం ఈ భవనంలోకి తరలించనుంది. వీలైనంత త్వరగా ప్రారంభోత్సవం చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలకు తూర్పుభాగంలో సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయం కొలువు తీరనుంది. ప్రస్తుతం విజయవాడ లెనిన్ సెంటర్‌లో సీఆర్డీఏ కార్యాలయం కొనసాగుతోంది.



సీఆర్డీఏ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ముగిసిన రాష్ట్రస్థాయి ర్యాకింగ్ చెస్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక లాంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి ర్యాకింగ్ చదరంగం పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా చదరంగం అధ్యక్షుడు రవీంద్రరాజు, సీనియర్ కోచ్ మురళీ కృష్ణ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను టోర్నమెంట్‌డైరక్టర్ వైవీకే చక్రవర్తి పర్యవేక్షించారు.

విజేతలు..

అండర్-6: వైశాలి (కృష్ణా), ఆధ్యశ్రీ(ఎన్టీఆర్), జాషువా(పల్నాడు), వియాన్ కృష్ణ(తిరుపతి)

అండర్-8: కావ్య, తన్విక, అయాన్ (గుంటూరు), గిరిజానందన్(ఎన్టీఆర్).

అండర్-10: హిమ్రిత (కృష్ణా), మయూక, పునీత్(గుంటూరు), రోషన్ (ఎన్టీఆర్)

అండర్-12: సుక్రుత, రిషిక్, సాయి (అనంతపురం), గీతిక(ఎన్టీఆర్)

అండర్-14: అనూష, హర్షవర్ధన్(గుంటూరు), హంసిక (ఎన్టీఆర్), నితీష్(అనంతపురం).

అండర్-16: దివ్య(గుంటూరు), వేదప్రియ (ఎన్టీఆర్), బార్గవ శ్రీనివాస్(పల్నాడు), చరణ్ (ఎన్టీఆర్)



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న రవీంద్రరాజు

రాజధాని నిర్మాణానికి రూ. 2,00,116 విరాళం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని నిర్మాణానికి విరాళంగా పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన వృద్ధురాలు కాసా నాగేంద్రమ్మ రూ. 2,00,116లు అందజేశారు. సచివాలయంలో సోమవారం సీఎం చంద్రబాబునాయుడును కలిసి నాగేంద్రమ్మ చెక్కును అందజేశారు. నాగేంద్రమ్మకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆమె వెంట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కూటమి నేతలు వున్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న కాసా నాగేంద్రమ్మ, పక్కన ఎమ్మెల్యే చదలవాడ తదితరులు

బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అండ

- గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి

రేపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి కృషి చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. సోమవారం బాపట్ల జిల్లా రేపల్లె టీడీపీ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్, సత్యప్రసాద్ చిత్రపటాలకు కల్లు, గీత కార్మికులు, చేనేత కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే గీతకార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. 2025-26 బడ్జెట్‌లో బీసీల అభ్యున్నతి కోసం రూ.47 వేల కోట్లు కేటాయించటం అభినందనీయమన్నారు. రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కృషిచేస్తున్నారన్నారు. తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు. బీసీలు కూటమిపార్టీలకు ఎప్పుడు అండగా ఉండాలన్నారు. చేనేత కుటుంబాలను ఆదుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం చేనేత మగ్గాలకు ఉచిత విద్యుత్ అందించటంతో పాటు నేతన్న భరోసా ద్వారా రూ.25 వేలు ఆర్థిక సాయం, నేతన్నల తయారు చేసే ఉత్పత్తులపై జీఎస్టీని తొలగించారన్నారు. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ కూటమిప్రభుత్వం బీసీల అభ్యున్నతి కోసం కోట్లాదిరూపాయలు వెచ్చించి ముందుకు వెళ్ళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమ డెల్టాప్రాజెక్టుకమిటి చైర్మన్ పంతాని మురళీధరరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యేమినేని లక్ష్మీశైలజ, జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు పాల్గొన్నారు.




చంద్రబాబు, పవన్, సత్యప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గీత, చేనేత కార్మికులు

- వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు
- వైద్య కళాశాలలకు ప్రభుత్వ ఆదేశాలు జారీ

ర్యాగింగ్ వద్దు

నేటి నుంచి... యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్



గుంటూరు వైద్య కళాశాల

జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఈ నెల 12వ తేదీ నుంచి 18 వరకు వారం రోజుల పాటు యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ నిషేధమని, ఇది చట్టరీత్యా నేరమని అధికారులు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సీనియర్ వైద్య విద్యార్థులు ర్యాగింగ్ జోలికి పోకుండా వారిలో అవగాహన పెంచేందుకు ఈ వారం పాటు యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్‌లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

గుంటూరు మెడికల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా ప్రవేశాలు పొందే జూనియర్ విద్యార్థులతో సీనియర్లు సత్ప్రవర్తనతో మెలిగి వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్ చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల రాష్ట్రంలో ఒకటి, రెండు వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ జరిగినట్లు వార్తలు వెలువడటంతో, స్పందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ర్యాగింగ్ నిరోధానికి గట్టి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఆరోగ్య మంత్రి సూచనల మేరకు, మంగళవారం నుంచి వారం పాటు యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్ నిర్వహించాలని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు ప్రభుత్వ, రెండు ప్రైవేటు వైద్య కళాశాలలు అందుబాట్లో ఉన్నాయి. కొత్తగా మెడిసిన్‌లో చేరే జూనియర్‌ల పట్ల అసభ్యకరంగా, అనైతికంగా వ్యవహరిస్తే అది ర్యాగింగ్ కిందకు వస్తుందని అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సహచరులతో అమానుషంగా వ్యవహరించినా దానిని ర్యాగింగ్‌గానే పరిగణిస్తామని, వారిపై కఠిన చర్యలు తీసుకొనేందుకు వెనుకాడబోమని వైద్యాధికారులు స్పష్టం చేశారు.

విద్యార్థులకు పలు పోటీలు...

యాంటీ ర్యాగింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా వైద్య విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తారు. యాంటీ ర్యాగింగ్ ఇతివృత్తంతో..నినాదాలు, వ్యాస రచన పోటీలు, ఫోటోగ్రఫీ పోటీలు, వాల్‌పోస్టర్ల తయారీ, వీధి నాటకాలను ఆయా కళాశాలల్లో నిర్వహించాలని హెల్త్ వర్శిటీ కోరింది. ర్యాగింగ్ వ్యతిరేక సందేశాలను ప్రోత్సహించే సంస్థల నుంచి వీడియో సందేశాలను కూడా వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. సదస్సులు, ఇంటరాక్టివ్ సెషన్స్, సెల్ఫీ కార్నర్ వంటి సృజనాత్మక అవగాహన కార్యక్రమాలు జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసా సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు పూర్తిస్థాయిలో భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని స్వయంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పంచాయతీ స్వీపర్ ఆత్మహత్య

యడ్లపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మనస్పర్థల కారణంగా పంచాయతీ స్వీపర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో హృదయరాణి (35) స్వీపర్‌గా పనిచేస్తోంది. భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఆమె గత కొంతకాలంగా భర్తతో విడిపోయి వేరుగా ఉంటోంది. సోమవారం సాయంత్రం తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని ఎస్ఐ శివరామకృష్ణ చెప్పారు.

ద్విచక్రవాహనాలు ఢీ: తాపీ మేస్త్రి మృతి

యడ్లపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు మృత్యువాత పడగా మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం కారుచోల గ్రామానికి చెందిన తాపీమేస్త్రి నల్లజర్ల కోటేశ్వరరావు (36) తాపీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. ఆదివారం రాత్రి కూలి డబ్బుల కోసం ద్విచక్రవాహనంపై యడ్లపాడుకు బయలుదేరాడు. అదే సమయంలో ఒడిశాకు చెందిన మిధున్ మాలిక్ దంపతులు స్కూటీపై యడ్లపాడులో పనులు చూసుకుని కారుచోల రోడ్డులోని నూలమిల్లుకు వస్తున్నారు. యడ్లపాడు గ్రామ శివారులోని ఎస్సీ శ్మశానవాటిక సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కోటేశ్వరరావు రోడ్డుపై వెల్లకిలా పడడంతో తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయాడు. స్కూటీపై వస్తున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కోటేశ్వరరావును చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ కోటేశ్వరరావు అదేరాత్రి 11.30గంటలకు మృతిచెందాడు. మృతుని భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో రేణుకా పరమేశ్వరి అమ్మవారు

రేణుకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నాదెండ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ పరిధిలోని రేణుకా పరమేశ్వరి అమ్మవారి మూడో వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గుర్రంవారి ఇలవేల్పు రేణుకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి డిగ్రీ కళాశాలలో హైదరాబాద్ మ్యాజిక్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూల్ క్యాంపస్ డ్రైవ్ మంగళవారం జరుగుతుందని ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాదు సోమవారం తెలిపారు. 2016 నుంచి 2024 వరకు ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, బీటెక్, డిగ్రీ, పీజీ చదవిన వారు అర్హులన్నారు. 600లకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. అదనపు సమాచారం కోసం 92470 25166 నంబరును సంప్రదించాలన్నారు.

● చిలకలూరిపేట: మండలంలోని వేలూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొండ్రగుంట కోటేశ్వరరావు (75) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు కొండ్రగుంట శ్రీనివాసరావు గుంటూరు ఎల్వీఆర్ క్లబ్ జాయింట్ సెక్రటరీగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు. కోటేశ్వరరావు మృతదేహానికి ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జీడీసీసీబీ మాజీ ఛైర్మన్ మానం వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు.

● బొల్లాపల్లి: విద్యా శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన బుక్‌లెట్ విధానంలో సోమవారం మండలంలో పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి ఫార్మాట్-2 అసెస్‌మెంట్-1 పరీక్షలు ఈ విధానంలో మొదలయ్యాయి. ఒకే విద్యా సంవత్సరంలో నాలుగు ఫార్మాట్ అసెస్‌మెంట్‌లు, రెండు సమోటో అసెస్‌మెంట్‌లు, జరగనున్నాయి. విద్యార్థుల సామర్థ్యాలను సరిగా అంచనా వేసేందుకు బుక్‌లెట్ విధానాన్ని తీసుకు వచ్చినట్టు ఎంఈవో పార్వతి తెలిపారు.

● శావల్యాపురం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని 15గ్రామ పంచాయతీల్లో పిల్లలందరితో నులి పురుగుల మాత్రలు మింగించాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నులిపురుగుల నివారణ దినోత్సవం క్యాలెండర్‌ను ఎంపీడీవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి రావిపూడి రమ్య, ఈవోపీఆర్డీ సుగుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, హెల్త్ సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి, సీనియర్ అసిస్టెంట్ అయ్యన్న పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: యువత ఉద్యోగావకాశాలను సృష్టించేలా అభ్యసించాలని టీడ్ అలెర్ట్ సంస్థ సీఈవో కే అజయ్ కుమార్ అన్నారు. సోమవారం ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో మార్కెటింగ్ స్ట్రాటజీస్ అనే అంశం మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కే అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆడేవారు... ఆడించేవారు కరువే



కారుమంచిలో పిచ్చిమొక్కలతో నిండిన క్రీడామైదానం

- పాఠశాలల్లో క్రీడలకు తగ్గుతున్న ప్రాధాన్యం
- పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న ఆట స్థలాలు
- వ్యాయామ ఉపాధ్యాయుల కొరత
- క్రీడాసామగ్రి అంతంత మాత్రమే
- పీడీల నిర్లక్ష్యంతో క్రీడాకారుల్లో పెరగని నైపుణ్యం

శావల్యాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించినపుడే విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదుగుతారని ప్రజాప్రతినిధులు, అధికారులు వేదికలపై ఉపన్యాసాలివ్వడం తప్ప పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి ఏమాత్రం చొరవ చూపటం లేదు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ఎంతో ప్రాధాన్యమిచ్చేవారు. కానీ మారుతున్న కాలాన్ని బట్టి ప్రభుత్వ పాఠశాల్లో కూడా కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా విద్యార్థులకు ఎక్కువ మార్కులు రావాలంటూ వారిపై ఒత్తిడిని పెంచడంతో వారు మానసికంగా కుంగిపోతున్నారు. క్రీడలతో విద్యార్థుల్లో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం పెరుగుతుంది. కానీ క్రీడలకిచ్చే ప్రాధాన్యం మాత్రం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. పాఠశాలల్లో సరైన ఆట స్థలాలు లేకపోవడం, ఆట స్థలాలున్నా బాగుచేయకపోవడం, వ్యాయామ ఉపాధ్యాయుల కొరత, క్రీడాసామగ్రి కొరత వంటివి విద్యార్థుల్లో క్రీడాభివృద్ధికి ఆటంకాలుగా నిలుస్తున్నాయి. శావల్యాపురం మండలంలో మొత్తం ఐదు జడ్పీ పాఠశాలలు, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు, 32 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో కారుమంచి, మతుకుమల్లి, శావల్యాపురం, పోట్లూరు, వేల్పూరు జడ్పీ పాఠశాలలు, కొత్తలూరు, పోట్లూరు ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే ఆటస్థలాలు ఉన్నాయి. శావల్యాపురం జడ్పీ పాఠశాలను కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకంలో చేర్చడంతో వచ్చే నిధులతో ఆటస్థలాన్ని అభివృద్ధి చేసి వివిధ కోర్టులు ఏర్పాటు చేశారు. మిగిలిన పాఠశాలల్లో ఆట స్థలాల నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఆట స్థలాల్లో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగినా సకాలంలో బాగుచేయించని పరిస్థితి నెలకొంది. ఇటీవల సాధారణ బదిలీల్లో ఐదు జడ్పీ పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఒక్క పోట్లూరు జడ్పీ పాఠశాలల్లో మాత్రమే కొత్తవారు చేరడంతో మిగిలిన నాలుగు జడ్పీ పాఠశాలల్లోనూ వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. వ్యాయామ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఆటలకు దూరంగా ఉంటున్నారు. పాఠశాలలకు ప్రభుత్వం, దాతలందించే క్రీడాసామగ్రి కూడా తక్కువగానే ఉంది. ఇటీవల శావల్యాపురం జడ్పీ పాఠశాల విద్యార్థులు మాత్రమే క్రీడల్లో ఆశించిన స్థాయిలో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. మిగిలిన జడ్పీ పాఠశాలల్లో ఆశించిన స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో రాణించిన దాఖలాలే లేవు. వ్యాయామ ఉపాధ్యాయుల నిర్లక్ష్యధోరణి కూడా క్రీడాకారుల పాలిట శాపంగా మారుతోంది. విద్యార్థులలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందింపజేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు పూర్తిగా విఫలమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



శావల్యాపురంలో పీఎంశ్రీ పథకంలో ముస్తాబైన క్రీడామైదానం

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో 131 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తన పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారంకోసం పంపాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి, ఆర్డీవో మధులత, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్లాస్టిక్ వ్యర్థాలతో నీటి, మట్టి, వాయు కాలుష్యం

● ఏఎంరెడ్డి కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నీటి, మట్టి, వాయు కాలుష్యాలకు ప్రధాన కారణం ప్లాస్టిక్ వ్యర్థాలని ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణంలో స్వచ్ఛాంధ్ర కింద పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణ హితమైన పత్యామ్నాయాలను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బార్గవ భూషణరావు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎం.హేమశ్రీ, డాక్టర్ ఎస్‌డీ ఫిరోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎంరెడ్డి ఫార్మశీ విద్యార్థులు

బ్యాడ్మింటన్ సెలక్షన్‌లో గుడ్‌షెపర్డ్ విద్యార్థి ఎంపిక

వినుకొండ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నేషనల్ కోచింగ్ సెంటర్ యానాంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో వినుకొండ గుడ్‌షెపర్డ్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కోట కమల్‌కుమార్ అండర్ -14లో ఎంపికయ్యాడు. ఎంపికైన కమల్‌కుమార్, అతని తల్లిదండ్రులను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గోపు ఇన్నారెడ్డి జీబీఆర్ స్టేడియంలో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన కమల్ కోచింగ్ నిమిత్తం యానాం వెళ్తున్నాడని, ఇక అక్కడే ఐదు సంవత్సరాలు ఉచితంగా విద్యతో పాటు బ్యాడ్మింటన్ ఉచిత కోచింగ్ ఇస్తూ నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడేందుకు శిక్షణ ఇస్తారని తెలిపారు. స్టేడియం నిర్మాణ దశ నుంచి తమ వద్ద కోచింగ్ తీసుకుంటూ జాతీయస్థాయికి విద్యార్థి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ గోపు ఇన్నారెడ్డి

రాష్ట్రస్థాయి క్రీడలకు శంకర భారతీపురం విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శంకర భారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఎం.పార్వతి సోమవారం తెలిపారు. ఒంగోలులో ఈ నెల 9, 10 తేదీలలో జరిగిన అట్యా-పాట్యా క్రీడలలో ఈ ఘనత సాధించారన్నారు. బాలుర, బాలిక జట్టులు ప్రథమస్థానంలో నిలిచాయన్నారు. పీ వరప్రసాద్ బెస్ట్ డిఫెండర్‌గా రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను పీడీలు వీ పద్మావతి, పీ తిరుపతిరావు, ఎస్‌కే ఫాతిమా, ఎస్‌కే రశీదా తదితరులు అభినందించారు.



ప్రతిభచూపిన విద్యార్థులతో హెచ్ఎం పార్వతి, ఉపాధ్యాయులు

జాతీయ క్రీడా దినోత్సవ పోటీల్లో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ పోటీలలో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభచాటారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. అండర్ 22 విభాగంలో ఖోఖోలో బాలికలు ముగ్గురు, బాలురు ముగ్గురు, కబడ్డీలో బాలికలు 3. బాలికలు ఇద్దరు, వాలీబాల్‌లో బాలుడు, అథ్లెటిక్స్‌లో బాలికలు 16మంది, బాలురు ఆరుగురు విజేతలుగా నిలిచారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాదు, పావం కృష్ణారావు, పీవీ అచ్యుతరావు, పీడీ రాయల ఆంజనేయులు అభినందించారు.

జోన్-3 పోటీలకు ఎస్‌బీఆర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌బీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జోన్-3 పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం డీ తావుర్యా సోమవారం తెలిపారు. 8, 9 తేదీలలో కోడెల శివప్రసాదరావు స్టేడియంలో జరిగిన అండర్-22 క్రీడాకారుల ఎంపిక పోటీల్లో ఈ ఘనత సాధించారన్నారు. వాలీబాల్ మహిళా విభాగంలో పీ ప్రణతి, ఎస్‌కే షహవాజ్, పీ జాహ్నవి, వై స్తోత్రాంజలి, ఎస్.త్రివేణి, బ్యాడ్మింటన్‌లో డీ వేదసాయి కార్తీక్, ఎంపిక అయ్యారన్నారు.

రైలు ఢీకొని యువకుడు మృతి



ఆంజనేయులు (ఫైల్ ఫొటో)

వినుకొండ టౌన్, ఆగస్టు 11: గూడ్స్‌రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని విఠరాజుపల్లి గ్రామ సమీపంలోని బీఈడీ కాలేజి వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ మండలం గోకనకొండ గ్రామానికి చెందిన మోగిలి ఆంజనేయులు (24) బహిర్భూమికి వెళుతూ రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందచేశారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంపై కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య, తల్లి ఉన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు.

హలో మాల - చలో ఢిల్లీని విజయవంతం చేయండి

వినుకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని హలో మాల - చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్ పాల్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని, ప్రభుత్వంలోని కీలక శాఖల్లో ఉన్న మాలలను లూపులైన్లలో వేసి మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని, పలు కీలక అంశాలపై ఢిల్లీలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగే ధర్నా కార్యక్రమానికి మాలలు భారీ తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ వర్కింగ్ అధ్యక్షుడుగా బేతం దేవానంద్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిపూడి ఏసురత్నం, ఉపాధ్యక్షులు కొండ్రు విజయ్, నియోజకవర్గ అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుధాకర్, బి.నాగేశ్వరరావు, పి.ఇజ్రాయిల్, కృపయ్య, పెనుమాల రమేష్, వెంకట్రావు, అనిల్, రాజా, నక్కా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

13న నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నిరసన

వినుకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీన సంయుక్త రైతు సంఘాల సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పల్నాడు జిల్లాలోని అన్ని మండలాల్లో ట్రంప్, మోదీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటూ పల్నాడు జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఉలవలపూడి రాము తెలిపారు. స్థానిక శివయ్య భవన్‌లోని రైతు సంఘం కార్యాలయంలో రైతు సంఘం నాయకులు బాలస్వామి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ వెంటనే ట్రంప్ మన దేశంపై విధించిన 50 శాతం సుంకాలను వెనక్కి తీసుకోవాలని, మోదీ వెంటనే డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, వ్యవసాయ వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యల ఆడిట్ తనిఖీలు

శావల్యాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండల సమాఖ్య, మండలంలోని 26 గ్రామసమాఖ్యల ఆడిట్ తనిఖీలను సోమవారం నిర్వహించారు. సెర్ప్ అధికారులు పాల్గొని మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యల ద్వారా గతేడాది డ్వాక్రా మహిళలు తీసుకున్న స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజీ తదితర రుణాలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్‌లు, లావాదేవీలు తదితర వివరాలను తనిఖీచేశారు. శావల్యాపురం మండల సమాఖ్య రూ.7లక్షలు లాభాల్లో ఉండగా గంటవారిపాలెం, పోట్లూరు, శావల్యాపురం, మతుకుమల్లి గ్రామ సమాఖ్యలు రూ.3 లక్షలకు పైబడి లాభాల్లో ఉన్నాయని, మిగిలిన 22 గ్రామ సమాఖ్యలు రూ.20వేల నుంచి 50వేల వరకు లాభాల్లో ఉన్నట్లుగా గుర్తించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల బారతి, ఇన్‌చార్జి ఏపీఎం రామాంజనేయులు, ఎల్‌సీ బ్రహ్మయ్య, సీసీలు రామారావు, కరుణమ్మ, మేరీ పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న సెర్ప్ అధికారులు

పీజీఆర్ఎస్‌లో రెండు ఫిర్యాదులు

రొంపిచర్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. అన్నవరం నుంచి మ్యుటేషన్ కోసం, తురుమెళ్ళ నుంచి సర్వేకోసం రెండు దరఖాస్తులు అందాయన్నారు.

● నూజెండ్ల: గ్రీవెన్స్ ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు తహసీల్దార్ జీ రమేష్‌కుమార్ అన్నారు. కంభంపాడు గ్రామానికి చెందిన రైతులు సర్వే కోసం గ్రీవెన్స్ ఫిర్యాదు చేశారన్నారు.



మురికిపూడి సొసైటీ నూతన కమిటీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

మురికిపూడి పీఏసీఎస్ కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవం

చిలకలూరిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అన్నివేళలా రైతులకు అండగా నిలవాలని, ఉదారంగా రైతులను ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం అన్నారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 1923లో ప్రారంభమైన మురికిపూడి సొసైటీకి ఎంతో మంచి చరిత్ర ఉందని, సంఘంలో రూ.8కోట్ల డిపాజిట్లు ఉన్నాయని చెప్పారు. ఇది చాలా గొప్పవిషయమన్నారు. సంఘం ఛైర్మన్‌గా చిగురుపాటి రాజబాబు, డైరెక్టర్లు తమ్మిశెట్టి నాగేశ్వరరావు, గుత్తికొండ సాంబశివరావులు ప్రత్తిపాటి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జువ్వాజి మదన్ మోహన్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, కరిముల్లా పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

చిలకలూరిపేట, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇనుపకోట్ల బజారులో రూ.16 లక్షల వ్యయంతో పునః నిర్మించిన 90ఏళ్ళ చరిత్ర ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ధర్మ సంఘం వారి గ్రంథాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పనిచేసే సిబ్బందిని, గ్రంథాలయం నిర్వాహకులను ప్రతిపాటి సత్కరించారు. కార్యక్రమంలో ధర్మ సంఘం కమిటీకి చెందిన గుర్రం సాంబశివరావు, పసుమర్తి వెంకట సూర్య ప్రకాశరావు, చేబ్రోలు శ్రీనివాసరావు, రాచమల్లు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గ్రంథాలయం నిర్వాహకులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

పాఠశాలకు రూ.లక్ష విలువైన ఆటో వితరణ

నాదెండ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంక్రాంతిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.లక్ష విలువైన ఆటోను సోమవారం అందజేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తోట శ్రీరాములు రూ.లక్ష వ్యయంతో కొనుగోలుచేసిన ఆటోను అందజేశారు. ప్రతి రోజు యడ్లపాడు మండలం చంఘీస్‌ఖాన్‌పేట, చందపేట నుంచి విద్యార్థులు పాఠశాలకు నడిచి వస్తున్నారు. వారి ఇబ్బందులను గుర్తించిన తోట శ్రీరాములు ఆటో సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రధానోపాధ్యాయుడు జానకిధరరావు, గ్రామస్థులు అభినందించారు.



ఉన్నత పాఠశాలకు అందజేసిన ఆటో



రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ కోటేశ్వరరావును సత్కరిస్తున్న ప్రవాసాంధ్రులు

పీ4లో భాగస్వాములు కావాలి

● ఏపీ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల

నరసరావుపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రవాసాంధ్రులు జన్మభూమిని మర్చిపోకుండా పేదలకోసం సీఎం నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చిన పీ4లో భాగస్వాములు అవ్వాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. అమెరికాలో కనెక్టికట్‌లో జాష్టి శ్రీకాంత్, రజనీకాంత్, పరుచూరి తరుణయ్య ఆధ్వర్యంలో జరిగిన మీట్ అండ్ గ్రీట్ విత్ గోనుగుంట్ల కోటేశ్వరరావు కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు పాల్గొని సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ మేల కిలోమీటర్ల దూరంలో ఉంటూ, స్వదేశాన్ని, స్వరాష్ట్రాన్ని, తెలుగుదేశం పార్టీని మర్చిపోకుండా మీరు చూపిస్తున్న అభిమానం, ఆప్యాయత మరువలేనిదన్నారు. ప్రవాసాంధ్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళాల్సిందిగా పలు విషయాలను గోనుగుంట్ల కోటేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో విశ్వనాథ్ నాయనిపాటి సభకు అధ్యక్షత వహించారు. మాగంటి ప్రసాద్, రమణయ్య, పరుచూరి చక్రధర్, రావెళ్ళ ఉత్తేజ్, శ్రీధర్ అరవపల్లి తదితరులు పాల్గొన్నారు.



రైతు నాయకుడు పోపూరి రామారావు, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

పోరాట యోధుడు పోపూరి రామారావు

● రాష్ట్ర రైతు సంఘం నాయకుడు కేశవరావు

యడ్లపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతు, శ్రామిక నాయకుడు పోపూరి రామారావు, 6వ వర్ధంతి, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో స్మారక సభ సోమవారం జరిగింది. యడ్లపాడు పీఆర్ విజ్ఞానకేంద్రంలో కేంద్రంలో నూతలపాటి కాళిదాసు అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర రైతుసంఘం నాయకుడు వై కేశవరావు, ప్రొఫెసర్ వేణుగోపాలరావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా రామారావు, స్వామినాథన్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో రాష్ట్ర రైతుసంఘం నాయకులు కేశవరావు మాట్లాడుతూ రైతు, శ్రామిక ఉద్యమాల్లో సుదీర్ఘకాలం పాల్గొన్న గొప్ప పోరాట యోధుడు రామారావు అని గుర్తుచేసుకున్నారు. రైతు ఆత్మహత్యలకు వ్యతిరేకంగా ప్రత్యేక వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని, అంగీకరించకపోవడంతో రైతు సంఘమే ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంఎస్ స్వామినాథన్ ఆకలిచావుల నుంచి ప్రజలను రక్షించడంకోసం ఆహారరంగంలో స్వయం సమృద్ధిని సాధించడంకోసం ఎంతో కృషిచేశారన్నారు. ఆగస్టు 13న క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్విట్ కార్పొరేట్ పేరుతో ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సభలో పి.సుబ్బారావు, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, ఎ.పెద్దబ్బాయి, సి.సృజన, జి.హరిబాబు ప్రసంగించారు. క్యూబా సంఘీభావ నిధికి రూ.5,140లు విరాళంగా సేకరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వై.రాధాకృష్ణ, గ్రామపెద్దలు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నరసరావుపేట విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ర్యాంకింగ్ ఓపెన్ గర్ల్స్ చెస్ టోర్నమెంట్ 2025లో రెండవ స్థానం సాధించినట్లు డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు తెలిపారు. ఈ నెల 10వ తేదీన అమరావతిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన పోటీలలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులతో ఆడి తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమములో డైరెక్టర్ నాగోతు సబితా ప్రిన్సిపాల్ రేఖా హులేకర్ తదితరులు పాల్గొన్నారు.